క్లుప్తంగా

'సామ' పద్య నాటకం ఘనత



సామ పద్య నాటకంలోని సన్నివేశం

కర్నూలు కల్చరల్: తిరుపతి అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి పద్య నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం నుంచి 'సామ' పద్య నాటకం ఎంపికైనట్లు అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు బీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాక్షేత్రం అధ్యక్షుడు, నాటక దర్శకుడు పత్తి ఓబులయ్యకు సమాచారం ఇచ్చారు. జూలై 20వ తేదీన మహతి ఆడిటోరియంలో నాటక ప్రదర్శన ఉంటుందని పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. నాటక కళాకారులకు ఆయన అభినందనలు తెలిపారు.

నోరు తెరచిన మ్యాన్‌హోల్స్



తెరచిఉన్న మ్యాన్ హోల్స్

కల్లూరు: కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి కృష్ణానగర్‌కు వెళ్లే దారిలో హంద్రీ బ్రిడ్జికి సమీపంలో మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా తెరచి ఉన్నాయి. దీంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వెంటనే మ్యాన్ హోల్స్‌పై గ్రిల్స్ (కవర్లు) ఏర్పాటు చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

పన్ను రిటర్న్స్ సకాలంలో దాఖలు చేయాలి



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీకాంత్

కర్నూలు (అగ్రికల్చర్): ఆదాయ పన్ను చెల్లింపులపై సహకార సంఘాలు, సీఈఓలు పూర్తి అవగాహన పెంచుకోవాలని కర్నూలు ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ ఎస్.శ్రీకాంత్ సూచించారు. బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ మందిరంలో సహకార సంఘాల సీఈఓలు, పర్సన్ ఇన్‌చార్జ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలను వివరించారు. సహకార సంఘాలు సకాలంలో ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడం ప్రాధాన్యతను ప్రత్యేకంగా వివరించారు. కోర్ సెషన్ సహకార సంఘ సభ్యులతో అవగాహన పెంచడంపై ఆయన దృష్టి సారించారు. కర్నూలులోని వార్డు-1లోని ఐటీఓ ఎం.సత్యానంద్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను నియమావళిని సరళీకృతం చేయడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పన్ను చెల్లింపుపై సహకార సంఘాల సీఈఓలు లేవనెత్తిన వివిధ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్ డి.పాండురంగ, జిల్లా సహకార అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థల్లో దాదాపు 10 వేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయకుండా ఉన్నవారితో చాకిరీ చేయిస్తుండడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు చెప్పారు. పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసన్న, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

లారీ బోల్తా



గుంతలో పడిపోయిన లారీ

పత్తికొండ: లారీ అదుపు తప్పి రహదారి పక్కన వంకలో పడిపోయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పత్తికొండ బైపాస్ రహదారిలో రమ్య రీసార్ట్ సమీపంలో అనంతపురం జిల్లా యాడికి నుంచి ఆదోని మార్కెట్‌కు పత్తిలోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం బ్రేక్ ఫెయిలై అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న వంకలో పడిపోయింది. బోల్తా పడి వాహనంలో ఇరుకుపోయిన వారిని స్థానికులు గమనించి బయటకు తీశారు. రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు సమీపంలో మలుపు ఉండటం వల్ల తరచూ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.







హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తూ పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు, నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గంగుల ప్రతాప్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్ తదితరులు, కల్లూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తదితరులు

హామీల అమలుకు ప్రభుత్వ మెడలు వంచుతాం

- సంక్షేమ పథకాలు అమలు చేసే వరకు ప్రజలతో కలిసి పోరాటం
- నగరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ
- భారీగా తరలివచ్చిన మహిళలు, పార్టీ శ్రేణులు

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు విస్మరిస్తే ప్రభుత్వ మెడలు వంచుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఏ హామీ అమలు చేయకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం స్థానిక ధర్నా చౌక్ నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. స్థానిక ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలిచ్చి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాడన్నారు. ఇప్పుడు ఏడాది గడిచినా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు, మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని మండిపడ్డారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నమ్మించి మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని, వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు.
- కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు లెక్కలేనన్ని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలకు తీరని ద్రోహం చేసిందన్నారు. గత ప్రభుత్వం మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా ఒక భగవద్గీత, ఒక బైబిల్, ఒక ఖురాన్‌లా భావించి ఐదేళ్ల పాటు చక్కని పాలన అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగ యువత, బడుగు, బలహీన వర్గాలు ఈ ప్రభుత్వ పాలన పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమానికి జగనన్న పునాది వేస్తే ఈ ప్రభుత్వం సమాధి చేసిందని విమర్శించారు.
- కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం ప్రతిఒక్కరినీ మోసం చేసిందన్నారు. మహిళలకు తల్లికి వందనం, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1500, యాభై సంవత్సరాలు దాటిన మహిళలకు రూ.4 వేలు పెన్షన్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. 2.60 లక్షల వలంటీర్లను, రేషన్ ఆపరేటర్లను తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ.. జగనన్న హయంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. అంతకు రెండింతలు ఇస్తామని చంద్రబాబు నాయుడు పదే పదే చెప్పి అన్ని వర్గాలను మోసం చేశారన్నారు.



కర్నూలులో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి, గంగుల ప్రతాప్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, అహ్మద్ అలీఖాన్, ఎస్వీ విజయమనోహరి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతరం పార్టీ నాయకులు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా, కార్పొరేటర్లు షేక్ యూనుస్ బాషా, జుబేర్, ఆర్షియా ఫర్హీన్, షేక్ అహమ్మద్, సత్యనారాయణమ్మ, కటారి పల్లవి, రాజేశ్వర రెడ్డి, నాయకులు రెడ్డిపోగు ప్రశాంత్, శశికళ, కల్లా నాగవేణి రెడ్డి, భారతి, షరీఫ్, రాఘవేంద్రనాయుడు, ఆదిమోహన్ రెడ్డి, కర్నాకర్ రెడ్డి కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

హరిత హితమే అత్యుత్తమ సేవ



పర్యావరణం గురించి వివరిస్తున్న యాగంటీశ్వరప్ప

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యుత్తమ సేవా మార్గమని పర్యావరణ వేత్త, ఉపాధ్యాయులు యాగంటీశ్వరప్ప అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన పర్యావరణ పరిరక్షణపై మాట పద్యం రూపంలో పిల్లలకు వివరించారు. ప్రతి జీవి జీవించడానికి అవసరమైన ఆహారం, గాలి, నీరు పచ్చని మొక్కల నుంచి లభిస్తున్నాయన్నారు. మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా మనిషితో పాటు సకల జీవులకు సేవ చేసినట్లని చెప్పారు. బాల్యం నుంచే మొక్కలు నాటడం పర్యావరణాన్ని పరిరక్షించడం అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడం పునరుత్పాదక ఇంధన వనరులను వాడటం, ఇంటి పెరటిలోనూ, డాబాలపైనా మొక్కలను పెంచడం ద్వారా ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షకులుగా ఉంటూ దేశ సుస్థిరాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ శిక్షణలో స్వచ్ఛందంగా పాల్గొన్న శిక్షకులను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యపై అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏపీఎస్‌పీ క్యాంపులో బైపాస్ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 130 మీటర్ల బైపాస్ రహదారి నిర్మాణం నిర్మించి ఏపీఎస్‌పీ క్యాంపు అంతర్గత రహదారికి అనుసంధానం చేసి హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. దీని వల్ల బళ్లారి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చన్నారు. రూ.85 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకాలతో రక్షణ కల్పించవచ్చని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం నగర శివారులోని బి.తాండ్రపాడు సచివాలయ పరిధిలో వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత, కిల్కారి మెసేజ్ విధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను మాతాశిశు సంరక్షణ కార్డులో సూచించిన తేదీ ప్రకారం క్రమం తప్పక ఇప్పించాలని తల్లులకు సూచించారు. ముఖ్యంగా ఎంఆర్ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్ రుబెల్లా టీకాను పిల్లలకు 9, 16 నెలల వయస్సులో తప్పక వేయించాలన్నారు. కిల్కారి మెసేజ్ విధానంలో గర్భిణులకు 4వ నెల నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్‌లు 01244451660 నంబర్ నుంచి వస్తాయన్నారు. ఏదైనా కారణం వల్ల గర్భిణి/తల్లి ఆ వాయిస్‌ను వినలేకపోతే తర్వాత 14423 నంబర్‌కు కాల్ చేసి వాయిస్ మెసేజ్‌ను వినేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కాల్స్ పూర్తిగా ఉచితమని, మాతాశిశు సంరక్షణ కోసం దీనిని రూపొందించినట్లు తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యశోద, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ కె.వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు, యువత చదువుతో పాటు భావ ప్రసార నైపుణ్యాలు పెంచుకోవాలని, అప్పుడే పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగ అవకాశాలు అందుకోగలుగుతారని సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ చెప్పారు. పికాక ఫౌండేషన్, ఐఆర్‌ఎస్ బి.దస్తగిరి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్‌ఆర్ పేటలోని శ్రీలక్ష్మి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహిస్తున్న కెరీర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్తా పత్రికలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ వంటివి చదవడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే కరెంట్ అఫైర్స్‌పై పూర్తి పట్టు సాధించవచ్చన్నారు. ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని, నైతిక విలువలు పాటిస్తూ, పట్టుదలతో కృషి చేసి విజయ శిఖరాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల సిద్ధం కావాల్సిన మెళకువలు, ఏయే రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయో వివరించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, న్యాయవాది బలరాం పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 5న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సుంకేసుల రోడ్డు, స్టాంటన్‌పురం, అశోక్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, సిరినోబుల్ ఫీడర్, మునగాలపాడు ప్రాంతాలకు, బాలాజీనగర్ ఏరియాకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలుష్య రక్కసిని కట్టడిచేద్దాం

- అధిక కాలుష్య కారక నగరాల్లో కర్నూలు
- ఎవరికీ వారే నియంత్రణ పద్ధతులు పాటించాలి
- అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి
- ప్లాస్టిక్ వాడకానికి ప్రజలు దూరంగా ఉండాలి
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



కర్నూలు నగరంలో స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2025లో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించాలనే అంశాన్ని ఐక్యరాజ్యసమితి మోటోగా స్వీకరించింది. అందులో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు ప్రపంచ దేశాలు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వినియోగం అధికమైంది. ఏ రంగంలోనైనా ప్లాస్టిక్‌తో తయారు చేసిన పరికరాల ఉపయోగం ఉంది. అందులో భాగంగా ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల వినియోగం కూడా అధికమైపోయింది. అయితే వాటి వినియోగం తరువాత అసలు సమస్య మొదలవుతోంది. ప్లాస్టిక్ మెటీరియల్‌ను క్షీణింపజేయడానికి వందల సంవత్సరాలు పడుతుంది. అంతవరకు ప్లాస్టిక్ ముక్క ఉన్న ప్రాంతంలో మొక్క కూడా మొలవదు. నదులు, సముద్రాల్లో కలిస్తే జీవరాశులకు ప్రాణహాని. ఒకవేళ వ్యర్థాలను కాల్చితే విషపూరిత వాయువులు వెలువడతాయి. ముఖ్యంగా కార్బన్ మోనాక్సైడ్, ఫ్లోరోక్లోరో కార్బన్‌లు, నైట్రోజన్, సల్ఫర్ తదితర హానికర వాయువులు వాతావరణంలో కలసిపోయి విషపూరితం అవుతున్నాయి. ఈ క్రమంలో ప్లాస్టిక్ వినియోగం నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఇప్పటికే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమల్లో ఉంది. ప్లాస్టిక్‌ను మరీ మరీ వినియోగించడానికి విరివిగా రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష మొక్కలు నాటే కార్యక్రమం

కాలుష్య కారకాలను నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం విశేష కృషి చేస్తోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని బృందం నగర వనంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసింది. మరోవైపు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కోసం విద్యార్థులకు బుధవారం ఉదయం 8 గంటలకు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం పర్యావరణ అవగాహన కోసం విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు.

పెరిగిపోతున్నా వాయు కాలుష్యం...

ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఏటా వాయు కాలుష్యం పెరిగిపోతోంది. పెరుగుతున్న మోటారు వాహనాల సంఖ్య, పట్టణాల చుట్టూ ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయనాలు, వాయువులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా 10 పీఎం (పర్టిక్యులర్ మ్యాటర్-సూక్ష్మధూళి కణాలు) క్యూబిక్ మీటర్ కంటే పలుచనైనా సూక్ష్మధూళి కణాలు (పీఎం10) నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, అమోనియా వాయువులు గాల్లోకి కలిసిపోతుండడంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. అంతేకాక ధ్వని కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతుండడం ఆందోళన కలిగిస్తోందని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ అధికారులు అంటున్నారు.



పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులు, శ్వాసకోశ వ్యాధులు తలెత్తుతాయి. పర్యావరణ నియంత్రణ అధికారుల్లోపై లోపాలు ఉన్నాయి. కేవలం ఒక్క కాలుష్య నియంత్రణ మండలిదే బాధ్యత అనుకుంటున్నారు. ఇందులో పోలీసులు, రోడ్డు, రవాణా, మునిసిపల్, పంచాయతీలతోపాటు అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యం కావాలి. అంతేకాక ప్రజల భాగస్వామ్యం లేకుంటే ఆశించిన ఫలితం ఏమాత్రం రాదు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నియంత్రణ పద్ధతులు పాటించాలి.

– కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రాంతీయ అధికారి

సారా విక్రేతలకు రూ.లక్ష జరిమానా

వెల్దుర్తి: మండలంలో సారా విక్రేతలపై గతంలో కోడుమూరు ఎక్సైజ్ శాఖ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయితే బైండోవర్ అతిక్రమించి తిరిగి ఎల్ నగరం అయ్యస్వామి, చిట్టెమ్మ, మద్దమ్మలు సారా విక్రయాలు కొనసాగించడంతో బుధవారం అరెస్టు చేసి తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఎదుట హాజరు పరిచినట్లు కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు బైండోవర్ సమయంలో వ్యక్తపరిచిన జరిమానా రూ. లక్షను నిందితుల నుంచి కట్టించినట్లు వెల్లడించారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. ఆయన బుధవారం న్యాయ సేవా సదన్‌లో మునిసిపల్, హెల్త్, పీసీబీ, ఫారెస్టు అధికారులతో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఎంహెచ్ఓ శాంతికళ, పీసీబీ ఈఈ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లిందకొండలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన నాగన్న కుటుంబం ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నా హక్కులు కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. నాగన్నకు పట్టా ఇవ్వకపోవడంతో దానిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడిందన్నారు. దీనిపై వెంటనే కలెక్టర్ కలుగజేసుకొని పూర్తి స్థాయి విచారణ చేయించి నాగన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

కార్బైడ్ పరిశ్రమను తెరిపించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర శివారులోని దిన్నెదేవరపాడులో ఉన్న కార్బైడ్ (వీబీసీ) పరిశ్రమను తక్షణమే తెరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు చెల్లించాల్సిన రూ.7 కోట్ల పీఎఫ్, ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. 2018లో పరిశ్రమ మూతపడటంతో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. అయితే యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. నాయకులు లక్ష్మన్న, భాస్కరరెడ్డి, ఆదిశేషన్న పాల్గొన్నారు.